క్లుప్తంగా

'సునీతారెడ్డికే టికెట్ ఇవ్వాలి'

కౌడిపల్లి(నర్సాపూర్): నర్సాపూర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్‌ను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి ఇవ్వాలని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ప్రవీన్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సునీతారెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా నియోజకవర్గం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. బీఆర్‌ఎస్ అధిష్టానం స్పందించి సునీతారెడ్డికి టికెట్ ఇవ్వాలని కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



రవికుమార్‌ను సన్మానిస్తున్న వర్తక సంఘం సభ్యులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకట్రావ్‌పేట గేట్ వద్ద గ్రామానికి చెందిన మెడికల్ షాప్ నిర్వాహకుడు మామిడి రవికుమార్ తన సొంత డబ్బులతో రూ.40వేలు విలువ చేసే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించేందుకు సహకారం అందించాడు. ఈ సందర్భంగా వర్తక సంఘం ఆధ్వర్యంలో గురువారం వెంకట్రావ్‌పేట గేట్ వద్ద సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం రవికుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ సెంటర్ల వద్ద వినియోగదారుల నిరీక్షణ



నర్సాపూర్‌లోని ఇంటర్నెట్ సెంటర్ వద్ద నిరీక్షిస్తున్న ప్రజలు

నర్సాపూర్: ఆధార్ కార్డులకు మొబైల్ నంబర్ల లింకు, రేషన్ కార్డులకు ఈకేవైసీ తదితర లింకేజీల కోసం ప్రజలు ఇంటర్నెట్ సెంటర్లపై ఆధారపడాల్సి వస్తుంది. గురువారం పట్టణంలోని ఓ ఇంటర్నెట్ సెంటర్ వద్ద ప్రజలు నిరీక్షించారు. కాగా, సర్వర్ సరిగా పని చేయకపోవడంతో మొబైల్ నంబరు లింకు చేసే పనులు నిదానంగా సాగడంతో చాలా సేపు వేచి ఉండాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యక్తి అదృశ్యం



నారాయణరెడ్డి (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లారం నారాయణరెడ్డి ఈ నెల 1న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. గతంలో పలుమార్లు ఇంట్లో నుంచి వెళ్లి నాచారంగుట్ట లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ సత్రంలో పనిచేస్తూ 10 రోజులకోసారి ఇంటికి వచ్చేవాడు. 20 రోజులు అయినప్పటికీ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు నాచారంగుట్టపైకి వెళ్లి చూడటంతో కనిపించలేదు. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో నారాయణరెడ్డి అక్క నర్సమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మట్టి, గడ్డి తొలగింపు



గడ్డి, మట్టిని తొలగిస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): తూప్రాన్– నర్సాపూర్ హైవే శివ్వంపేటలోని డివైడర్‌పై మట్టి, గడ్డి, పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదే విషయాన్ని సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో సంబంధిత అధికారులు స్పందించారు. గురువారం 600 మీటర్ల మేర రోడ్డు డివైడర్ మధ్యలో పేరుకపోయిన మట్టి, గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించారు. దీంతో వాహనదారులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు. డివైడర్‌కు రంగులు వేయిస్తామని హైవే ఈఈ రామకృష్ణ తెలిపారు.

హెచ్‌ఎంగా బాలచంద్రం

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా బాలచంద్రం గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ హెచ్‌ఎంగా విధులు నిర్వహించిన బుచ్చనాయక్ చిన్నగొట్టిముక్ల పాఠశాలకు వెళ్లారు. ఆయన స్థానంలో చేగుంట మండలం చందాయిపేట పాఠశాల నుంచి బాలచంద్రం బదిలీపై వచ్చారు. మెరుగైన విద్యా బోధనకు కృషి చేస్తానని బాలచంద్రం చెప్పారు.

అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్



సంఘీభావం తెలుపుతున్న మహేందర్‌రెడ్డి

నర్సాపూర్: అంగన్‌వాడీ టీచర్లను ఆయాలను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నర్సాపూర్ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు ఆయాల నిరవధిక సమ్మె గురువారం నాటికి 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు మహేందర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ, పలువురు ప్రతినిధులు మంజుల, వరలక్ష్మి, రాజేశ్వరీ, మమత, స్వరూప, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్ ప్రదర్శన



చంద్రయాన్ మోడల్

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న మూగ విద్యార్థి చేసిన చంద్రయాన్ ప్రదర్శన అకట్టుకుంది. శివ్వంపేట ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అల్లపూరం మదన్ పుట్టుక నుంచి మాటలు రావు. అయినప్పటికీ చదువు, డ్రాయింగ్, సైన్స్ ప్రదర్శనలో ప్రతిభ కనబరుస్తూ అందరికంటే ముందుంటున్నాడు. గురువారం చంద్రయాన్–3 విక్రమ్ ల్యాండర్, రోవర్ మోడల్ తయారుచేసి వాటి పనితీరు గురించి ప్రదర్శన ద్వారా వివరించాడు. విద్యార్థి మూగ అయినప్పటికీ చదువుకు ఆటంకం ఉండదనే విషయం తెలియజేస్తున్నాడు. మదన్ ప్రదర్శన పట్ల ఉపాధ్యాయులు అభినందించారు.

తరుణ్‌చుగ్‌ను కలిసిన బీజేపీ నేతలు



తరుణ్‌చుగ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న గోపి, పక్కన బండి సంజయ్ తదితరులు

నర్సాపూర్: ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, జాతీయ ప్రధాన కార్యదర్శులు సునీల్ బన్సల్, బండి సంజయ్‌కుమార్‌లను ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి గురువారం కలిశారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కార్యకర్తలు కష్టపడి పని చేయాలని సూచించినట్లు తెలిపారు.

భవనం నిర్మించాలని రాస్తారోకో



జీపీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో కూల్చివేసిన పాఠశాల భవనాన్ని వెంటనే పునర్నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. గురువారం నార్సింగి పంచాయతీ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. పాఠశాల నూతన భవనాన్ని త్వరలో నిర్మిస్తామని ప్రకటించిన అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పాఠశాలను ఉర్దూ మీడియం స్కూలుకు తరలించారని, అక్కడ వసతులు లేక తమ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. వారితో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు



దీక్ష చేస్తున్న నాయకులు

అల్లాదుర్గం(మెదక్): రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోరుతూ రెవెన్యూ డివిజన్ సాధన జేఏసీ ఆధ్వర్యంలో చిల్వెర ఐబీ చౌరస్తాలో చేపడుతున్న రిలే నిరహార దీక్షలు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు బ్రహ్మం మాట్లాడుతూ నాలుగేళ్లుగా సబ్ డివిజన్ కోసం కోరుతున్నా.. ఇప్పటివరకు ఎస్టీఓ ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. గురుకుల పాఠశాల, డిగ్రీ కళాశాల లేక ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు 60 కిలోమీటర్ల దూరంలో మెదక్ వెళుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్వరగా డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాములు, రిటైర్డ్ ఇంజనీర్ గురప్ప, మెహబూబ్ అలీ, నాగయ్య, శంకర్, మల్లయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

శివ్వంపేట(నర్సాపూర్): ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని బీఆర్‌ఎస్ నేత కృష్ణారావు, ఎంపీటీసీ సత్తిరెడ్డి, సర్పంచ్ బాబురావు అన్నారు. మండల పరిధి ఉసిరికపల్లిలో పాస్టర్ కరుణాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడం గొప్ప విషయం అన్నారు. ఇలాంటి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉమెన్ అండ్ చిల్డ్రన్ వెల్ఫేర్ అసోసియేషన్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యాచురోపతి పూణే, నేచర్ క్యూర్ హెల్త్ కేర్ సెంటర్ వారి ఆధ్వర్యంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ప్రకృతి వైద్య విధానం, ఆరోగ్య సూక్తులు, సిరిధాన్యాల గురించి వైద్యురాలు రిఖ్యా ప్రియదర్శిని వివరించారు. ఈ కార్యక్రమంలో పీఎస్ పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పామ్‌పై అవగాహన

నిజాంపేట(మెదక్): దీర్ఘకాలిక ఆదాయం వచ్చే ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపాలని మండల వ్యవసాయ అధికారి సతీశ్ అన్నారు. మండలంలోని బచురాజ్‌పల్లి గ్రామంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ఎకరాకు 57 మొక్కలను సబ్సిడీపై అందిస్తోందని అన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌తో పాటు అంతర పంటల నిర్వహణకు రూ.4,200 చొప్పున ప్రభుత్వం అందిస్తోందని వివరించారు. ఆయిల్‌పామ్ పంటలు సాగు చేసి రైతులు అధిక లాభం పొందాలని సూచించారు. ఏఈఓ కావేరి, సర్పంచ్, నర్సవ్వ, ఉపసర్పంచ్ మల్లేశం, రైతు బంధు సమన్వయకర్త రాజు, రైతులు మల్లేశం, భాస్కర్, యాదయ్య, రాజు, సత్తయ్య, బాలయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రులు



కౌడిపల్లి: వెల్మకన్నలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు



మనోహరాబాద్: చెట్లగౌరారంలో వినాయకుడికి పూజలు చేస్తున్న తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్



కొల్చారం: రంగంపేట ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గణనాథుడి వద్ద..

మాజీ ఎమ్మెల్యే వాసురెడ్డి కన్నుమూత



వాసురెడ్డి (ఫైల్)



మృతదేహానికి నివాళులర్పిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): మాజీ ఎమ్మెల్యే ఆర్‌ఎస్ వాసురెడ్డి(80) మండల పరిధిలోని పొలంపల్లిలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. వాసురెడ్డి 1984లో రామాయంపేట నియోజకవర్గం నుంచి బీజేపీ నుంచి గెలుపొంది 1989 వరకు సేవలను అందించారు. తర్వాత జరిగిన ఎన్నికల్లో ఆయన ఓడిపోగా టీఆర్‌ఎస్ ఆవిర్భావం అనంతరం తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని టీఆర్‌ఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్‌గా పనిచేశారు. ఎనమిదేళ్ల క్రితం తిరిగి బీజేపీలోకి వచ్చిన వాసురెడ్డి పార్టీలోనే కొనసాగుతూ వచ్చారు. అనారోగ్య కారణలతో ఏడాది కాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటూ ఇంటివద్దే విశ్రాంతి తీసుకుంటున్న వాసురెడ్డి గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావుతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, దుబ్బాక కోకన్వీనర్ గోవింద్, మండల అధ్యక్షుడు భూపాల్ వాసురెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. చేగుంటలో అఖిలపక్ష నాయకులు వాసురెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు.

కదంతొక్కిన కలం సైనికులు

- అల్లాదుర్గం హైవేపై రాస్తారోకో
- బాధ్యులపై చర్య తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతి



అల్లాదుర్గం రహదారిపై రాస్తారోకో చేస్తున్న జర్నలిస్టులు

రేగోడ్(మెదక్): అల్లాదుర్గం సాక్షి జర్నలిస్ట్ వీరేందర్‌పై దాడి చేసిన ఎంపీపీ అనీల్‌పై చర్య తీసుకోవాలి టీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. గురువారం అల్లాదుర్గం ఐబీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, హైవేపై రాస్తారోకో చేపట్టారు. అనంతరం టీయూడబ్ల్యూజే–ఐజేయు జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాళ్ చారి మాట్లాడుతూ.. ప్రజలకు నిజాలను తెలిపే జర్నలిస్టులపై దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. ఘటనపై ఎమ్మెల్యే స్పందించకపోవడం సరికాదని, జర్నలిస్ట్‌పై పెట్టిన అక్రమ కేసును వెనక్కి తీసుకోవాలన్నారు. ఎంపీపీపై హత్యానేరం కేసు నమోదు చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీజీ శ్రీనివాస్ శర్మ కోరగా, ఉద్యమాలకు టీయూడబ్ల్యూజే అండగా ఉంటుందని రాష్ట్ర కమిటీ సభ్యులు మిన్పూర్ శ్రీనివాస్ తెలిపారు. ఎంపీపీ అనిల్ రెడ్డి క్షమాపణ చెప్పాలని ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు నాగరాజు, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ స్పందించాలని ఐజేయూ నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, ఐజేయూ సభ్యులు బుక్క అశోక్, కోశాధికారి దేవరాజ్, అందోల్ తాలూక అధ్యక్షులు భూమయ్య, రామాయంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మల్లేశం, రేగోడ్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు శంకర్ గౌడ్, నారాయణ ఖేడ్ డివిజన్ అధ్యక్షులు అలీం, జోగిపేట యాదగిరి, వెంకట్ రెడ్డి, మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రాజ్, జొన్నోజు రామాచారి, జిల్లా కార్యదర్శి ఆనంద్ కుమార్, జిల్లా నాయకుడు తూర్పు సంతోష్ కుమార్, నగేష్, రవి, లక్ష్మీ నారాయణ, పాపయ్య, సాక్షి జిల్లా ప్రతినిధి నీలం, బిక్షపతి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం

జర్నలిస్ట్‌పై దాడి చేసిన ఎంపీపీపై చర్యలు తీసుకోవాలని సాక్షి జిల్లా బృందం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. దాడి చేయడమేకాకుండా అక్రమ కేసు నమోదు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవ పరిస్థితుల ఆధారంగా వార్తలు రాసే జర్నలిస్టులపై రాజకీయ నాయకులు దాడులు చేయడం సరికాదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు బిక్షపతి, మోహన్‌రాజ్, నరేశ్‌గౌడ్, సంతోష్‌కుమార్, పెంటయ్య, బీరప్ప, రాంచందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

జర్నలిస్ట్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని అల్లాదుర్గం కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం 161 జాతీయ రహదారిపై నిరసన తెలిపి, అనంతరం తహసీల్దార్ సతీశ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బల్‌రాం, నర్సింహరెడ్డి, వినయ్‌గౌడ్, రవి, మహేశ్, సదానందం, మధు, పాండు, సాయిలు, రితిశ్, శ్రీను, రాములు, శంకరయ్య, జైపాల్, సాయిబాబా, ఎంపీటీసీ దుర్గయ్య, మాణయ్య, బాలకిషన్, పాపయ్య, అభిలాశ్‌రెడ్డి, సాయిరెడ్డి, రాజు, మల్లేశం, దత్తురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సంగమేశ్వర్, ప్రవీణ్‌గౌడ్, కల్యాణ్ పాల్గొన్నారు.

చిన్నశంకరంపేటలో...

చిన్నశంకరంపేట(మెదక్): అల్లాదుర్గం విలేకరిపై దాడి చేసిన చేసిన ఎంపీపీపై చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో చిన్నశంకరంపేటలో గురువారం రాస్తారోకో చేపట్టారు. ఎంపీపీ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నిజాలను రాసే విలేకరిపై దాడి చేసిన ఎంపీపీపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణ, నాయకులు ఆవుల గోపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ఓయూ జేఏసీ నాయకులు మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **25న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు**

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 25న స్కూల్ గేమ్స్,ఫెడరేషన్ గేమ్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ –14, అండర్–17 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 10 గంటల లోపు క్రీడామైదానం చేరుకోవాలని సూచించారు.

◆ **దెబ్బతిన్న మత్తడి పరిశీలన**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని గౌతోజీగూడెంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న మత్తడిని ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్ గురువారం పరిశీలించారు. కాగా గౌతోజీగూడెం– సికింద్లపూర్ గ్రామాల మధ్య గల ధ్వంసమైన మత్తడిని త్వరలోనే మరమ్మతు చేస్తామని హామీ ఇచ్చారు.

◆ **ఎమ్మెల్యే పరామర్శ**

మెదక్ మున్సిపాలిటీ: పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ ఎలవర్తి మహాలక్ష్మి గురువారం అనారోగ్యంతో మరణించగా, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. మృతురాలి కోడలు, 8వ వార్డు కౌన్సిలర్ జయశ్రీని, కుమారుడు దుర్గా ప్రసాద్‌ను పరామర్శించారు. ఎమ్మెల్యేతో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

◆ **ఎంపీపీ పరామర్శ**

పెద్దశంకరంపేట(మెదక్): ఇటీవల గుండెపోటుతో మృతిచెందని పెద్దశంకరంపేట ఐకేపీ సీసీ లక్ష్మణ్ కుటుంబాన్ని గురువారం ఎంపీపీ జంగం శ్రీనివాస్ పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సంతాపం ప్రకటించారు. ఆయనతో వైస్ ఎంపీపీ లక్ష్మీ, ఎంపీటీసీ వీణ, మానిక్‌రెడ్డి తదితరులున్నారు.

◆ **ఘనంగా నవరాత్రి ఉత్సవాలు**

పెద్దశంకరంపేట(మెదక్): పేట మండలంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వాడవాడల ప్రతిష్టించిన మండపాల వద్ద భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండపాలను పోలీసులు పర్యవేక్షిస్తూ నిర్వాహకులకు సూచనలిస్తున్నారు.

◆ **ఆర్థిక సాయం**

నిజాంపేట(మెదక్): మండలంలోని నార్లాపూర్‌లో అనారోగ్యంతో మృతిచెందిన బీజేపీ నాయకుల కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందు జనార్దన్ రెడ్డి పరామర్శించారు. బీజేపీ నాయకులు ప్రణయ్ కుమార్, మంగలి ప్రవీణ్ కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. ఆయనతో మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, నరేష్, మోర్చా అధ్యక్షుడు వెంకటేష్, బూత్ అధ్యక్షుడు ధర్మారెడ్డి, స్వామి, నవీన్, బాస రాములు, లింగ, నార్లాపూర్ డీలర్ తిరుపతి తదితరులు ఉన్నారు.

◆ **బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): టీచర్ బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కంచన్‌పల్లి, వెల్మకన్న, దేవులపల్లి, కొడిపల్లి, రాయిలాపూర్, బూరుగడ్డ తదితర పాఠశాలలో టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాదగిరి, రాష్ట్ర కౌన్సిలర్స్ హీరాలాల్, సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి నజీరుద్దీన్, వెంకటేశం, మాధవచౌదరి పాల్గొన్నారు.

◆ **అన్నదానం**

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రం పాపన్నపేటలో గురువారం నవయువ సేన ఏర్పాటు చేసిన వినాయక మంతపం వద్ద అన్నదానం నిర్వహించారు. వెంకటేశ్వర హాస్పిటల్ డాక్టర్ సాయి చైతన్య సహకారంతో దీనిని ఏర్పాటు చేశారు.

◆ **పేదలకు వరం సీఎంఆర్ఎఫ్**

తూప్రాన్: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డుకు చెందిన అబోతు రమ్యకు రూ.48వేలు, 3వ వార్డుకు చెందిన పర్స బాల మల్లయ్య రూ.60 వేలు, కాళ్లకంటి లక్ష్మికి రూ.60 వేలు విలువచేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ పంపిణీ చేశారు. వైస్‌చైర్మన్ శ్రీనివాస్, కమిషనర్ మోహన్, కౌన్సిలర్లు మామిడి వెంకటేష్, కృష్ణ, రవీందర్‌గుప్తా, భగవాన్‌రెడ్డి, బొంది వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ **'అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు'**

వెల్దుర్తి(తూప్రాన్): అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు యాదగిరి గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆందోళనలు చేపడతామని భావించి అక్రమ అరెస్టులు చేయడం సరికాదన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

◆ **జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన**

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని గుజిరి తండాలో నూతనంగా నిర్మించనున్న పంచాయతీ భవన నిర్మాణానికి సర్పంచ్ రాకేష్‌నాయక్ గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. పంచాయతీ భవనానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ **మిల్లు వేలం**

పాపన్నపేట(మెదక్): కొత్తపల్లి సొసైటీ రైస్ మిల్లుకు గురువారం వేలం నిర్వహించగా రూ.27.60 లక్షల ఆదాయం వచ్చినట్లు చైర్మన్ త్యార్ల రమేష్ తెలిపారు. సొసైటీకి చెందిన రైస్ మిల్లు గత కొన్నేళ్ళుగా వృథాగా ఉంటుంది. రమేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ వేలం నిర్వహించారు. గతేడాది రూ.21.60 లక్షలు కాగా, ఈ ఏడాది రూ.5లక్షలు అదనంగా వచ్చినట్లు తెలిపారు.

◆ **నేడు మండల సమావేశం**

హవేళిఘణాపూర్(మెదక్): శుక్రవారం ఉదయం 11 గంటలకు హవేళిఘణాపూర్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీరామ్ తెలిపారు. ఎంపీపీ అధ్యక్షుడు శేరి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

◆ **రేయిన్ కోట్ల పంపిణీ**

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు చైర్మన్ చంద్రపాల్ రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో సిబ్బందికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు వీటిని అందించినట్లు తెలిపారు. 5వ వార్డు కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు, బీఆర్‌ఎస్ నాయకులు అరవింద్ గౌడ్, డిప్యూటీ ఇంజనీర్ మహేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, మేనేజర్ బట్టి చంద్రమోహన్, నాగరాజు పాల్గొన్నారు.

◆ **నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక**

కొల్చారం(నర్సాపూర్): ఉపాధిహామీ పథకంలో భాగంగా కొల్చారం మండల 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గణేష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 2021 జూలై నుంచి 2023 మార్చి 31వరకు చేపట్టిన ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక ఉంటుందన్నారు. సమావేశానికి ఆయా గ్రామాల సర్పంచులు, ప్రాదేశిక సభ్యులు, మండల అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది హాజరుకావాలని సూచించారు.

◆ **భవన నిర్మాణానికి చేయూత**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్ళకల్ గ్రామంలో అంగన్‌వాడీ–2 భవన నిర్మాణానికి ఐటీసీ ఎంఎస్‌కే వాష్ ముందుకు వచ్చారు. గురువారం కాళ్ళకల్ సర్పంచ్ నత్తి మల్లేష్‌తో కలిసి ఈమేరకు స్థల పరిశీలన చేశారు. సంస్థ తరపున భవనం నిర్మిస్తామని ఇంజనీర్లు సుబ్బయ్య, శాంతివర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఏఈఓ కళ్యాణ్, ఉప సర్పంచ్ రాజుయాదవ్, వార్డు సభ్యులు రమేష్, నాయకులు నర్సింహ్మా, మురళి, అశోక్ తదితరులున్నారు.